

# పొగమంచు

**ఎస్.ఆర్.స్వామి**

జనవరి నెల. వాతావరణం బాగా చల్లగా ఉంది. తెల్లారిపోయినా ప్రపంచాన్ని కప్పిన పొగమంచు ఇంకా విడిపోలేదు. విమానాశ్రయంలో కాలు కాలిన పిల్లిలాగా అటూ ఇటూ నడుస్తోంది వర్ధనమ్మ. దాచాలని ఎంత ప్రయత్నించినా చిరునవ్వు దాచుకోలేకపోతున్నారు ఆవిడ. అవును మరి! అయిదు సంవత్సరాల తర్వాత ఆమె కొడుకు విదేశం నుంచి వస్తున్నాడు. ఆ ఆనందం, సంతృప్తి ఆమె మొహంలో స్పష్టంగా కనిపిస్తున్నాయి.

పొగమంచు కారణంగా విమానం దిగలేక విమానాశ్రయం చుట్టూ తిరుగుతున్నదని అనౌన్స్‌మెంట్ వచ్చింది. పైన తిరుగుతున్న విమానం కన్నా వేగంగా తిరుగుతున్నాయి వర్ధనమ్మగారి ఆలోచనలు.

బాబు పుట్టినప్పటి నుంచి వాడిని బాగా చదివించాలనీ, అమెరికాకు పంపాలనీ అనుకున్నారావిడ. ఆవిడ స్నేహితురాలు పెళ్లయ్యాక అమెరికా వెళ్లి అక్కడ జీవితం గురించి రాసిన ఉత్తరాలు, ఇక్కడికి వచ్చినప్పుడు చెప్పిన మాటలూ, తెచ్చిన వస్తువులూ ఈ ఆలోచనను మరింత పెంచాయి. ఇంజనీరింగ్ చదివించి పై చదువులకు అమెరికాకు పంపాలనే దృష్టితో దొరబిడ్డలా పెంచింది కొడుకుని. వాడిని అమ్మా అని కూడా పిలవనివ్వలేదు ఆమె. మాటలు వచ్చిరాని రోజులనుంచే మమ్మీ అనే పిలుపు నేర్పింది. ఆ రోజు ఆమెకు బాగా గుర్తుంది. అప్పుడు బాబుకి మూడో ఏడు. ఇంటి పనులు పూర్తి చేసుకుని మంచంమీద నడుం వాల్చింది. అంతే— గుమ్మం దగ్గర ఆడుకుంటున్న బాబు అత్తా అత్తా అత్తొచ్చింది అని కేకలు వేసుకుంటూ పరుగెత్తుకొచ్చాడు. ఆమె మొహం ఎర్రగా కందిపోయింది.

ఎన్నిసార్లు చెప్పాలిరా నీకు ఆంటీ అని పిలవమని? కోపంగా నాలుగువేసింది వాడి వీపుమీద. బిక్కమొహం వేసుకుని నిలబడిపోయింది ఆవిడ ఆడబిడ్డ. వదినా మరదళ్లిద్దరూ ఏవో కబుర్లు చెప్పుకుంటూ కూర్చున్నారు. మళ్లీ వచ్చాడు వాడు మమ్మీ... కాక్కా. కాక్కా... ఆమె ముఖం మళ్లీ ఎర్రబడింది. ఈసారి ఆమె ఆడబిడ్డ అడ్డుపడింది కనుక దెబ్బలు తగలలేదు బాబుకి.

టాయిలెట్‌కి వెళ్లాలని చెప్పమని ఎన్నిసార్లు నేర్పించినా వీడు ఇంతే ఆమె విసుక్కుంటూ లేచింది.

అత్తగారెంత మొత్తుకున్నా చేత వెన్నముద్ద గానీ మా తెలుగుతల్లికీ మల్లెపూదండ గాని నేర్పనివ్వలేదు ఆవిడ. మూడుమైళ్ల దూరంలోఉన్న ఇంగ్లీషు మీడియం బడిలో చేర్పించింది బాబుని. రెండో భాషగా కూడా తెలుగు నేర్చుకోనివ్వలేదు, ఫ్రెంచ్ నేర్పించింది. పొరపాటున కూడా తెలుగు సినిమా చూడనివ్వలేదు. కబడ్డీ ఆడాలన్నా, ఫుట్‌బాల్ ఆడాలన్నా వాడికెంతో ఇష్టం వుండేది గాని ఆవిడ పడనివ్వలేదు. క్రికెట్ గాని టెన్నిస్‌గాని ఆడమని పట్టుపట్టింది. ఇంజనీరింగ్ పాసయ్యాడు బాబు. అమెరికాకు పై చదువుకు వెళ్లి అక్కడే ఉద్యోగం సంపాదించుకున్నాడు. అయిదు సంవత్సరాల తర్వాత వస్తున్నాడు. ఓ మంచి పిల్లని చూసి వాడికి పెళ్లి చేసేస్తే తన బాధ్యత తీరిపోతుందని ఆమె అనుకుంది. పక్కనే ఉన్న మేనకోడలివైపు చూసిందామె. కుందనపు బొమ్మలా వుంది. వాడికి ఈడూ జోడూ సరిపోతుందనుకుంది.

"మమ్మీ" ఎదుట నిలుచున్న కొడుకుని చూసి ఉక్కిరిబిక్కిరి అయిపోయింది వర్ధనమ్మ. ఎంత ఎదిగిపోయాడు వాడు! అచ్చం దొరబాబులాగే ఉన్నాడు. పద మమ్మీ పోదాం అతి కష్టంమీద తెలుగులో పలికాడు. అతను నడిచాడు.

వెనుక వర్ధనమ్మ, ఆమె వెనుక ఆమె మేనకోడలు, ఆ తర్వాత ఓ దొరసాని.

ఎయిర్‌పోర్టునుంచి రోడ్డుమీదకు దిగే మెట్ల దగ్గర ఓ నిముషం ఆగాడు అతను. మమ్మీ మర్చిపోయాను. ఈమె నీ కోడలు వెనుకవస్తున్న దొరసానిని పరిచయం చేశాడు.

వర్ధనమ్మ కళ్లు తిరిగిపోయాయి. హైహీల్స్ షూస్, ఫ్రాక్, విరబోసుకున్న తెల్ల జుత్తు ఆ అమ్మాయి తన కోడలా? కళ్లు పక్కకు తిప్పేసుకున్నారావిడ. పక్కనే తెలుగుతనం ఉట్టిపడిపోతూ కుందనపు బొమ్మలా ఉన్న మేనకోడలూ!

'ఏమిటిరా!' కోపం ఆపుకోలేకపోయింది ఆవిడ. మనదేశంలో ఆడపిల్లలే లేనట్లు ఏంటిరా ఈపని?

మనదేశంలో ఆడపిల్లలు నాకెలా పనికొస్తారు మమ్మీ? నేను ఈ ఊళ్లో పుట్టినా అమెరికాలో పుట్టినట్లు పెరిగాను కదా మమ్మీ. అయినా విదేశీ భాష నేర్చుకున్నప్పుడు లేని బాధ ఇప్పుడెందుకు మమ్మీ.!!

వర్ధనమ్మ నోట మాటరాలేదు. పొగమంచులో చిక్కుకుపోయి వెలుతురు అందించలేకపోయినందుకు సిగ్గుపడుతున్న సూర్యుడు మెల మెల్లగా మబ్బుల మెట్లు దిగాడు.